**Eenadu**

# గిరిపుత్రుల ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రత్యేక శిక్షణ

- ముప్పైవేల మంది లక్ష్యం
- సిద్ధమైన ప్రణాళికలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గిరిజన పుత్రులకు ఉద్యోగ నైపుణ్యాలు, పోటీ పరీక్షలపై శిక్షణ కార్యక్రమాలు సాగుతున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ గిరిజన తెగల సహకార ఆర్థిక వ్యవస్థ (ట్రైకార్) ద్వారా 2016-17 సంవత్సరంలో 30,000 మందికి శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి అనుగుణంగా జిల్లాల్లో ఉన్న గిరిజన యువజన శిక్షణ కేంద్రాల్లో ఎంపిక చేసిన వారికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల అనుసరించి ఈ ఏడాది 5000 మందికి శిక్షణ ఇవ్వాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం, తిరుపతి, కర్నూలు, వైజాగ్, ఇతరచోట్ల బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ ఉద్యోగాల కోసం శిక్షణ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఏపీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ నోటిఫికేషన్ అనుసరించి అర్హత కలిగిన వారికీ శిక్షణ ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై రాష్ట్ర సాంఘిక గిరిజన సంక్షేమ శాఖమంత్రి రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో ఈ తరహా శిక్షణ కార్యక్రమాలకు రూ. 6.5 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మరో రూ. 40 కోట్లు కేటాయించి గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగ కల్పనా నైపుణ్యాలను 11000 మందికి, స్వయం ఉపాధి శిక్షణను 3000 మందికి, గ్రాడ్యుయేట్ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ 1,000 మందికి, ఇంజినీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో రెండువేల మందికి, పాలిటెక్నిక్ ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాల్ని పొందేందుకు రెండు వేలమందికి శిక్షణ ఇప్పించాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించింది. 135 గిరిజన పాఠశాలల్లో స్వయం ఉపాధి, చిన్నతరహా పరిశ్రమలు, వృత్తివిద్యా కోర్సుల్లో 4500 మందికి శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు.

**కొత్తగా 10 శిక్షణ కేంద్రాలు:** త్వరలో జరగనున్న నోడల్ ఏజెన్సీ సమావేశంలో పది యువజన శిక్షణ కేంద్రాల్ని ప్రారంభించేందుకు చర్చించనున్నారు. కృష్ణా జిల్లా- మైలవరం, గుంటూరు-ప్రత్తిపాడు, మాచెర్ల, చిత్తూరు-రేణిగుంట, కుప్పం, అనంతపురం-బుక్కరాయసముద్రం, కర్నూలు-కర్నూలు, నెల్లూరు-కావలి, కడప-రాజంపేట, ప్రకాశం-కొత్తపట్టణంలలో కొత్తగా యువజన కేంద్రాలు రాబోతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే 24 కేంద్రాలు నడుస్తున్నాయి. మరో నాలుగు త్వరలో ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.